# అనుమానం

"అత్తయ్యా! ఆ బోషాణం పెట్టెలో ఏమున్నాయి?" ఉండబట్టలేక అడిగేసాడు అత్తవారింటికి వచ్చిన చైతన్య.


"పనికిరాని వస్తువులు తప్ప ఇంకేముంటాయి బాబు" అన్నది పార్వతమ్మ పెదిమ విరుస్తూ.

ఆవిడ మాటలు చైతన్యకు ఎందుకో నమ్మబుద్ధి కావడం లేదు. బోషాణంలో ఏమీ లేనప్పుడు దానికి రెండు తాళం కప్పలు వేయడమెందుకు? సరే వేసారే అనుకుందాం, తెరచి చూపించవచ్చు కదా? రోజులు గడుస్తున్నకొద్దీ అతడిలోని అనుమానం పెనుభూతమైంది. మామ గారు అందులో విధిగా నగానట్రా దాచిపెట్టి ఉంటారన్న నిర్ణయానికొచ్చేసాడు.

భూషయ్యకి ఇద్దరు కూతుళ్ళు. రెండెకరాల మెట్టు, చిన్న పెంకుటిల్లు తప్ప అతడికి చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు. బాధ్యతల్ని దింపుకోవడం కోసం ఉన్న భూమిలో ఎకరంన్నర అమ్మేసి కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు. పెద్దల్లుడు ప్రదీప్, చిన్నల్లుడు చైతన్య. పట్నంలో మంచి ఉద్యోగాలు, చేస్తున్నారు. ప్రదీప్ మామగారి పెట్టుపోతలకు ఆశపడే మనిషికాదు. పైగా ఆయన ఆర్థిక పరిస్థితిని చూసి సానుభూతి కురిపించేవాడు. చైతన్య మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధం. తనకెక్కడ పెట్టవలసి వస్తుందోనని మామగారు దరిద్రమోడుతున్నారన్నది అతడి స్థిరమైన అభిప్రాయం. అందుకే పిలిచినా పిలవకపోయినా తరచూ అత్తవారింట్లో తిష్టవేయసాగాడు.

ఒకమారు సంక్రాంతి పండక్కికుటుంబ సమేతంగా అత్తవారింటికి వచ్చిన చైతన్య తన హ్యాండ్ బేగు పోయిందని బాంబు పేల్చాడు. భయపడి పోయారు భూషయ్య

దంపతులు.



"అందులో ఏ మాత్రం సొమ్ము ఉంటుంది బాబు?" అని అడిగింది పార్వతమ్మ.

'రెండు వేలు' అన్నాడు చైతన్య ఠపీమని.

గుండె దడదడలాడింది భూషయ్యకి.

చైతన్య భార్యచేత ఇల్లంతా వెతికించాడు.

ఎక్కడా బ్యాగు కనిపించకపోవడంతో భూషయ్య అల్లుడి అనుమానాన్ని నివృత్తి చేయడం కోసం బోషాణం కూడ తెరవవలసి వచ్చింది.

అందులో పనికిరాని డబ్బా రేకులు, ఇనుప సామాన్లు తప్ప ఇంకేమీ లేవు.

"హమ్మయ్య" అంటూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు చైతన్య.

అల్లుడెందుకలా అంటున్నాడో అర్థంగాక అతడి వంక అయోమయంగా చూశాడు భూషయ్య.

"మరేం లేదు నాన్నా ఆ బోషాణం పెట్టెలో మీరు వజ్రాలు, వైడూర్యాలు దాచి పెట్టారేమోనన్న. అనుమానం ఇన్నాళ్ళూ ఆయన్ని పట్టిపీడించింది. ఇప్పుడా సందేహం నివృత్తికావడంతో ఊపిరి పీల్చుకున్నారు. మీచేత ఆ బోషాణం తెరిపించడానికే ఇంత నాటకం ఆడారు" అన్నది భర్త ఆంతర్యం తెలిసిన అవంతి.

కూతురి మాటలకు అవాక్కైపోయారు భూషయ్య దంపతులు.

**(ఆంధ్రభూమిడైలి నేటి కథ)**